# మధురానుభూతినిచ్చిన అతిథి

- ఆయన మాటలో తీయదనం
- చేయి పడితే చికిత్స చేసినట్టే
- ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్తాత్రేయ పర్యటనతో పులకింత



**ఆయన అమెరికాలో పెద్ద పేరుమోసిన క్యాన్సర్ డాక్టర్. నిమిషం ఖాళీలేకుండా వైద్య వృత్తిలో బిజీగా ఉంటారు. ఇటీవల ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి శస్త్ర చికిత్స చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఆయన భారతీయుడు, అందులోను కృష్ణాజిల్లా వాసి కావడం మనకెంతో గర్వకారణం. ఆయన పేరే డాక్టర్ నోరి దత్తాత్రేయుడు. పదేళ్ళ తరువాత ఈయన అమెరికా నుంచి ఇండియా వచ్చారు. జిల్లాలో ఆయన పుట్టిపెరిగిన ప్రాంతాలలో కలియ తిరిగారు. అతిథిగా అందరూ ఎంతగానో గౌరవించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అనేక మంది ఆయనను కలసి సలహాలు తీసుకుని సందేహాలు తీర్చుకున్నారు. రాక రాక జిల్లాకు వచ్చిన నోరి రెండురోజుల పర్యటన పులకింత కలిగించింది. పుట్టి పెరిగిన ఊరి వారితో ఊసులాడారు. బాల్య స్నేహితులు, పలువురు వైద్యులతో నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.**

(ఆన్‌లైన్ - మచిలీపట్నం)

పేరుగాంచిన క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రెండు రోజుల పాటు జిల్లాలో గడిపారు. ఆయన రాక ఎందరికో ఆనందం కలిగించింది. ఇక్కడ పుట్టి పెరిగి అమెరికాలో స్థిరపడ్డ ఆయన వైద్య వృత్తిలో అగ్రగణ్యులుగా ఉన్నారు. ఆయన పర్సనల్ న్యాయవాది కుమారుడు వివాహ నిమిత్తం హైదరాబాద్ వచ్చిన నోరి సొంతూరిని చూడాలనే ముచ్చటతో జిల్లాకు వచ్చారు. బుధ, గురు వారాలలో విజయవాడ, తోట్లవల్లూరు, మచిలీపట్నంలో బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. శుక్రవారం జైపూర్ వెళ్ళిన నోరి అక్కడ ఒక సదస్సులో పాల్గొని అనంతరం అమెరికా వెళతారని బంధువుల ద్వారా తెలిసింది. మీడియా ద్వారా ఆయన రాకను తెలుసుకున్న అనేక మంది ప్రముఖులు శుక్రవారం ఆయనను కలిసేందుకు ఆశ పడ్డారు. ఆయన వెళ్ళిపోయిన సంగతి తెలుసుకుని నిరాశకు గురయ్యారు. తాడంకిలో పుట్టిన ఈయన తోట్లవల్లూరులో పెరిగారు. మచిలీపట్నంలో అక్షరాభ్యాసంతో పాటు విద్యాభ్యాసం కూడా చేశారు. ఈయన తండ్రి తాడంకి హైస్కూలులో సెకండరీగ్రేడ్ టీచర్‌గా పనిచేశారు. 12 మంది సంతానంలో ఒకరైన నోరి దత్తాత్రేయుడు క్యాన్సర్ వైద్యనిపుణులుగా ప్రపంచ ఖ్యాతిని గడించారు. ఆయనకు పద్మభూషణ్ అవార్డు ఇవ్వాలనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే చేసింది. అది ఆచరణలోకి రావాలని ఆయన్నెరిగిన అనేక మంది కోరుతున్నారు. 1975లో అమెరికా వెళ్ళిన ఈయన ఇటీవల ఎఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధికి జరిగిన శస్త్ర చికిత్సతో వెలుగులోకి వచ్చారు. దేశ ప్రతిష్ఠను ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేశారు. అంతటి వైద్యనిపుణులు జిల్లా వాసి కావడం ఎంతో గర్వకారణమని పలువురు వైద్యులు భావిస్తున్నారు. మచిలీపట్నంలోని ఆయన సోదరి ఇందిరా దేవి ఇంటికొచ్చిన డాక్టర్ నోరిని అనేక మంది మర్యాదపూర్వకంగా పలకరించారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు తమతమ కుటుంబ సభ్యులతో బందరు వచ్చి నోరితో గడిపారు. ఇదొక మరుపురాని మధురానుభూతిగా తమ మదిలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నోరి ఘనతను గుర్తించిన జిల్లా ప్రజలందరూ ఆయనను ఆత్మీయ అతిథిగా గుర్తించారు.

## ఆయన ఆలోచనా విధానమే వేరు



దత్తాత్రేయుడి ఆలోచనా విధానమే వేరు. ఏ రోగమైనా మూలాలకు వెళ్ళి పరిశోధించడం ఆయనలోని ప్రత్యేకత. క్యాన్సర్‌పై ఆయన చేసిన పరిశోధనా పత్రాలు ప్రపంచ వైద్య విధానాన్నే నూతన దిశలో నడిపించాయి. క్యాన్సర్‌లో ఎన్ని రకాలు ఉన్నాయో ముందుగా విశ్లేషించింది వీరే. రోగాన్ని సరిగా గుర్తించడం, గుర్తించిన రోగానికి వేగవంతంగా నయమయ్యే పద్ధతులను ఆయన కనుగొన్నారు. ఆయన హస్తవాసి ఏమిటోగాని తేలిగ్గా రోగి ఉపశమనం పొందుతాడు. ఆయన వద్ద వైద్యం చేయించుకున్న వాళ్ళు 10 నుంచి 15 ఏళ్ళ వరకు చక్కగా జీవించిన వారున్నారు. కర్నూలు మెడికల్ కళాశాలలో నేను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసినప్పుడు నావద్ద హౌస్ సర్జన్‌గా పనిచేశారు.

– డా.అశ్వనీకుమార్, ప్రముఖ వైద్యుడు, మచిలీపట్నం

## ఎంతో స్ఫూర్తి పొందా



దత్తాత్రేయుడు నుంచి నేను ఎంతో స్ఫూర్తిని పొందాను. ప్రపంచంలో రేడియో థెరఫీలో నూతన ప్రక్రియలను కనుగొని గతంలో ఆయన ప్రపంచాన్నంతటినీ ఆకర్షించారు. రోగి వారాల తరబడి ఇన్‌పేషెంట్‌గా ఉండకుండానే ఒక అరగంటలో వైద్యం చేయించుకుని ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఇదొక అరుదైన ప్రక్రియ. ఎన్టీరామారావు సీఎంగా ఉన్నప్పుడు ఆయన భార్య బసవతారకంకు నోరి వైద్యం చేశారు. ఆ సమయంలో నోరి కోరిక మేరకే ఎన్టీఆర్ హైదరాబాద్‌లో బసవతారకం క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రం దత్తాత్రేయుడి మానసిక పుత్రిక.

– డా.బి.కేశవకృష్ణ, సర్జన్, ఐఎంఏ పట్టణ కార్యదర్శి

## మా ఇంట్లో పుట్టడం గర్వంగా ఉంది



ప్రపంచ ప్రఖ్యాత గాంచిన వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మా ఇంట్లో పుట్టడం గర్వంగా ఉంది. ఆయన తండ్రిగారు, మా తాతగారు కలసి తాడింకి హైస్కూల్‌లో పనిచేశారు. అప్పట్లో మా ఇంట్లో అద్దెకున్నప్పుడు దత్తాత్రేయుడు జన్మించారు. ఎఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి అమెరికాలో క్యాన్సర్ ఆపరేషన్ చేసినప్పుడే ఎంతో సంతోషించాం. ఇదంతా ఆయన పుట్టిన మా ఇంటి మహిమగా, మా స్థల ప్రభావంగా భావిస్తున్నాం.



దత్తాత్రేయ పుట్టిన ఇల్లు

– ఎన్.ఎ.కె.స్వామి, తాడంకి జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం

## నోరి పరిశోధనలపై యువత అధ్యయనం చేయాలి



ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు పొందిన నోరి దత్తాత్రేయుడు సాధించిన విజయాలు, పరిశోధనలపై నేటి యువ వైద్యులు అధ్యయనం చేయాలి. దత్తాత్రేయుడు కనుగొన్న దివ్య ఔషధాలు రోగులకు క్యాన్సర్ పట్ల భయం లేకుండా చేశాయి. ఆయన ఒక అరుదైన పరిశోధకుడు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడే రోగుల కోసం ఆయన కనిపెట్టిన డ్రగ్స్ అంతర్జాతీయ పేరు ప్రఖ్యాతులు పొందాయి. 1965లో దత్తాత్రేయతో పాటు చదువుకున్నా. బాల్యం నుంచి ఆయన ఎక్కువ పరిశోధనా రంగంపై ఆసక్తి చూపేవారు. ఇలాంటి వైద్యుడితో కలసి చదువుకోవడం నిజంగా నా అదృష్టం.

– డా.బి.శ్రీనివాసాచారి, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

## బందరులోనే అక్షరాభ్యాసం



దత్తాత్రేయ తల్లిదండ్రులు బందరులోని సర్కిల్‌పేటలో నివసించేవారు. నోరికి అక్కడే అక్షరాభ్యాసం జరిగింది. పాఠశాల స్థాయి నుంచి కళాశాల దాకా బందరులోనే నోరి చదువుకున్నారు. ప్రాథమిక విద్యను జె బ్రాంచ్‌లోను, జైహింద్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ విద్యను అనంతరం నేషనల్ కాలేజీలో విద్య అభ్యసించారు. అనంతరం కర్నూలులో ఎంబిబిఎస్, హైదరాబాద్‌లోని ఉస్మానియాలో ఎండి చదివారు. గతంలో ఎన్‌టిఆర్ భార్య బసవతారకంకు, సంజీవరెడ్డి భార్యకు వైద్య చికిత్స చేశారు. ఆయన వైద్యంలో చేసిన సేవలకు గాను నాయుడమ్మ అవార్డు వచ్చింది. పద్మ భూషణ్ జాబితాలో ఆయన పేరుంది. 1960వ దశకంలో అమెరికా వెళ్ళారు. అక్కడ సాయిబాబాకి రెండు దేవాలయాలు నిర్మించారు. బాబాకు బందరులోనే ప్రత్యేకంగా పల్లకీ తయారు చేయించి తీసుకెళ్ళారు. ఇంతటి గొప్ప వ్యక్తి బందరు పట్టణంలో చదువుకుని ప్రపంచ ప్రఖ్యాతిగా ఎదగడం మనందరికీ గర్వకారణం.

– ఎల్.ఎస్. శాస్త్రి, సమీప బంధువు, మచిలీపట్నం



అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు, బావలతో నోరి దత్తాత్రేయుడు

## మనసారా మాట్లాడలేపోయాం



ఎప్పుడో చిన్నప్పుడు చూశాం. నోరి దత్తాత్రేయుడు మేము అన్నదమ్ముల పిల్లలం. చిన్నప్పుడు వీరికి అప్పుడప్పుడు ఆయుర్వేద వైద్యం చేసేవాళ్ళం. పెద్ద చదువులు చదువుకుని విదేశాలకు వెళ్ళడం వల్ల రాకపోకలు తగ్గిపోయాయి. ఇన్నేళ్ళకు వచ్చిన దత్తాత్రేయుడుతో మనసారా మాట్లాడలేకపోయాం. వైద్య వృత్తిలో ప్రావీణ్యత సంపాదించి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న డాక్టర్ నోరి మరింత ఎదగాలని కోరిక.

– నోరి సత్యనారాయణ, లక్ష్మి దంపతులు (తోట్లవల్లూరు)

# అభ్యుదయ సమాజానికి ఆధ్యాత్మిక పునాదులు

**జాయింట్ అడ్మినిస్ట్రేటివ్ చీఫ్ ఆఫ్ బ్రహ్మకుమారీస్ దాదీ రతన్‌మోహినీజీ**

(ఆన్‌లైన్, లబ్బీపేట)

అభ్యుదయ సమాజానికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి ఆధ్యాత్మికత వాస్తవిక పునాదులు కల్పిస్తుందని జాయింట్ అడ్మినిస్ట్రేటివ్ చీఫ్ ఆఫ్ బ్రహ్మకుమారీస్ దాదీ రతన్‌మోహినీజీ అన్నారు. శుక్రవారం బృందావన కాలనీలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ప్లాటినం జూబ్లీ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రతన్ మోహినీజీ మాట్లాడుతూ మానవులందరూ ఆర్థిక, విజ్ఞాన, రాజకీయపరంగా అనేక భౌతిక విషయాల పురోగతికై ప్రయత్నం చేస్తూ వుంటారని తెలిపారు. సాగరగర్భం నుంచి అంతరిక్షం వరకు, భూమి ఆ చివర నుంచి ఈ చివర వరకు ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని పరిశోధనలు చేస్తుంటారన్నారు. ఆధ్యాత్మికత ద్వారా పెంపొందే విలువలు ఈనాటి ప్రపంచంలోని సామాజిక, వ్యక్తిగత సమస్యలకు చక్కని పరిష్కార మార్గాలను ప్రసాదిస్తాయని ఆమె ఉద్బోధించారు.




ప్రసంగిస్తున్న దాదీ రతన్ మోహినీజీ. కార్యక్రమానికి విచ్చేసిన బ్రహ్మకుమారీలు

మానవ జీవితానికి అవసరమైన సత్యమైన శాంతి, సంతృప్తి, సంతోషం, ప్రేమ తదితర గుణాలను అనుభూతి చేయాలని కూడా పరితపిస్తుంటారని అన్నారు. పరమాత్మ బోధించే జ్ఞాన యోగాలను అందరికీ అందించేందుకు ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం విశ్వవ్యాప్తంగా ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఓ శాంతకృష్ణ, సుధాకర్, గోపాల్, లీలా తదితరులు పాల్గొన్నారు.

### విశ్వదర్శన్ భవనం ప్రారంభం

పటమట: ప్రతి ఒక్కరూ తమ మనస్సు నుంచి అహాన్ని పారదోలగలిగితే మానవాళి అంతా సుఖంగా జీవించవచ్చునని దాదీ రతన్ మోహినీజీ పేర్కొన్నారు. శుక్రవారం పటమట లక్ష్మీ నర్సింగ్ హోమ్ వీధిలో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారీస్ విశ్వదర్శన్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని, అన్నిమతాల సారాంశం ఒక్కటే అన్నారు. ఎదుటి వారికి హాని చేయనంత కాలం ఎటువంటి ఆపద మన దరిదాపులకు రాదన్నారు. భవనంలోని కార్యాలయాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే భవిష్యత్‌లో వారికి మంచి ఫలితం ఉంటుందన్నారు. ట్రాఫిక్ ఏసీపీ వెంకట రమణ మాట్లాడుతూ మానవాళిని చెడు మార్గం నుంచి సన్మార్గంలోకి నడపడానికి కృషి చేస్తున్న బ్రహ్మకుమారీస్ అభినందనీయులు అన్నారు. కార్యక్రమంలో నగరంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సభ్యులు పాల్గొన్నారు.



మోహినీజీ ఆశీస్సులు అందుకుంటున్న జాయింట్ కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట రమణ